క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: చార్మినార్ సీబీడీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జనప్రియా ఓహెచ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు న్యూఫ్రెండ్స్ కాలనీ, జనప్రియా అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, జనప్రియా ఏబీసీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేశవనగర్, కృష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్‌మార్కెట్, గుమ్మకొండ కాలనీ తదితర ప్రాంతాల్లో కోతలు విధిస్తున్నామన్నారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ నార్మ్ ఫీడర్, రాజేంద్రనగర్ ఫీడర్ల పరిధిలో 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాజేంద్రనగర్ గ్రామం, ఐఐఎంఆర్, హెచ్‌టీ, నార్మ్ హెచ్‌టీ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

10 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రేషన్ దుకాణాల్లో ఈనెల 10వ తేదీ నుంచి ఉచిత బియ్యం కార్డుదారులకు అందుబాటులో ఉంటాయని సరూర్‌నగర్ సర్కిల్ ఏఎస్‌ఓ బాలసరోజ, రాజేంద్రనగర్ సర్కిల్ రేషన్ డీలర్ల అధ్యక్షుడు జావీద్ ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో జూలై నెలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని సీసీఎస్ ఆదేశాల మేరకు 10 నుంచి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు దారులు గమనించి డీలర్లకు సహకరించాలని కోరారు.

శంషాబాద్‌లో..

మున్సిపాలిటీ, మండలంలో రేషన్ బియ్యాన్ని ఈనెల 10 నుంచి సరఫరా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 10వ తేదీ నుంచి ఆయా ప్రజా పంపిణీ దుకాణాల్లో ఉచిత రేషన్ బియ్యం కార్డుదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

రాష్ట్ర స్థాయి సాంకేతిక పరిశోధన సదస్సు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి సాంకేతిక పరిశోధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పశువుల, పాడి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇందులో పశుసంవర్థక శాఖతో పాటు, మత్స్య శాఖ, సంచాలకులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి రైతులతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు ఎకాంబరం, వీసీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరితంతోనే ఆహ్లాదం

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది ఏళ్లుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమాన్ని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేసి పెట్టారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను మించి మొక్కలను నాటి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలనే లక్ష్యంతో వారు పని చేస్తున్నారు. ప్రధాన, అంతర్గత రోడ్లతో పాటు ఈసారి అపార్ట్‌మెంట్‌లు, వ్యక్తిగత గృహాల్లోనూ నాటుకునే మొక్కలను పెంచి వాటితో పాటు వర్మి కంపోస్టు ఎరువులను ప్రజలకు అందిస్తున్నారు. వాటిని ప్రతి ఇంటి వారు సాధ్యమైనన్ని ఎక్కువ మొక్కలు తీసుకుని నాటి, సంరక్షించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

సొంత నర్సరీల్లోనే పెంపకం..

జంట మున్సిపాలిటీల్లో గతంలో ఇతర నర్సరీల్లో నుంచి మొక్కలను కొనుక్కుని వచ్చి రోడ్ల వెంట నాటేవారు. మణికొండలో మూడేళ్ల క్రితం మొక్కల పెంపకాన్ని టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అవి సఫలీకృతం కాలేదు. దీంతో గత సంవత్సరం నుంచి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నాలుగు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూడు చోట్ల సొంత నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. వాటికి ప్రత్యేక రిటైర్డ్ అటవీ అధికారులను నియమించుకున్నారు. అనేక రకాల మొక్కలను నర్సరీలలో పెంచటం, పార్కులను అభివృద్ధి చేయటం లాంటి పనులను వారు చేపడుతున్నారు.

హరితహారానికి సన్నద్ధం

- కాలనీల వారీగా మొక్కల పంపకం
- వర్షాలు కురవగానే రోడ్డు పక్కన పనులు
- మున్సిపాలిటీల్లోనే మొక్కల పెంపకం



నార్సింగి నర్సరీల్లో సిద్ధంగా ఉన్న పూలమొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

అపార్ట్‌మెంట్‌లకు అనుకూల మొక్కలే ఎక్కువ..

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, సొంత గృహాలే అధికంగా ఉండటంతో వారందరికీ ఉపయోగపడే మొక్కలనే అధికంగా పెంచుతున్నారు. వాటిల్లో తులసి, కరివేపాకు, మందార, అశ్వగంధ, టేబుల్ రోస్, సిసిలిపేనియా, బోగనవిలియా, మునగ, సంపెంగ, పారిజాతం, దేవకాంచన, దానిమ్మ, గన్నేరు, బొప్పాయి, టికోమా, జామ, గంగరేను, నేరేడు, ఉసిరి, స్పైడర్ లిల్లీ, మల్లె, తెల్లంతస్ లాంటివి ఉన్నాయి. బయట నర్సరీల్లో డబ్బులు పెట్టి కొనే మొక్కలన్నీ ఉచితంగా లభిస్తుండటంతో ప్రజలు వారికి కావాల్సిన మొక్కలు మున్సిపాలిటీల నర్సరీల్లో నుంచి తీసుకుంటున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కాలనీల వారీగా మొక్కలను తీసుకెళ్లి ప్రజలకు అందిస్తున్నారు.

ఇవీ ఈ సంవత్సరం టార్గెట్‌లు..

8వ విడత హరితహారంలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల వెంట నాటేందుకు 15 వేల టార్గెట్, ప్రజలకు ఉచితంగా ఇచ్చేందుకు 1.25 లక్షల మొక్కలను ఇప్పటికే సిద్ధం చేసి కాలనీల వారీగా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. రోడ్ల వెంట నాటాల్సిన మొక్కలకు ఇప్పటి వరకు మంచి వర్షాలు కురవకపోవటంతో గుంతలు తీసే పనులను చేపట్టలేక పోయారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల వెంట లక్షా 14 వేల మొక్కలు నాటాల్సిన టార్గెట్ ఉండగా పనులను చేపట్టలేకపోయారు. ప్రజలకు పంచే మొక్కలను లక్ష అరుణోదయ కాలనీ నర్సరీలో సిద్ధంగా ఉంచి వార్డుల వారీగా పంపిణీకి సమాయత్తం అవుతున్నారు.



మణికొండ నర్సరీల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

విజయవంతం చేస్తాం..



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మొక్కలను నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు అనువైన స్థలాలు, వనరులు ఉన్నాయి. అందుకే ప్రతి సంవత్సరం ఎక్కువ మొత్తంలో నాటుతున్నాం. దీంతో రోడ్ల పక్కన అవి ఎంతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. మొక్కలు ఏపుగా పెరగటంతో రోడ్ల రూపురేఖలు మారిపోతున్నాయి. ఈ సంవత్సరం అనువైన స్థలాలను ఎంపిక చేశాం. టార్గెట్‌ను పూర్తి చేసి హరితహారాన్ని విజయవంతం చేస్తాం.

– వెంకటేశ్‌యాదవ్, నార్సింగి మున్సిపాలిటీ

ప్రజల నుంచి స్పందన బాగుంది..



ప్రజలకు అవసరమైన మొక్కలనే అధికంగా ఈసారి నర్సరీల్లో పెంచటం, వాటిని ఉచితంగా అందిస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో మంది వచ్చి కాలనీలలోని పంపిణీ కేంద్రాలు, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నర్సరీ నుంచి మొక్కలను తీసుకుని వెళ్తున్నారు. మొక్కలు పెంచి, అవి ఇచ్చే మంచి గాలితో ఆరోగ్యంగా జీవించటాన్ని ప్రజలు గమనించారు.

– ఫల్గుణ్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

ఆలయాల అభివృద్ధికి కృషి

రాజేంద్రనగర్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మధుబన్ కాలనీ అభివృద్ధిలో భాగంగా పార్కు ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే పనులు చేపట్టనున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో ఉన్న ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.



పోచమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, సరికొండ వెంకటేష్, మసున వెంకటేష్, రఘుయాదవ్, డీపీకుమార్, విజయ్‌కుమార్, సతీష్, బొల్ల నరేందర్, ఎల్లప్ప, ప్రసాద్, మల్లేష్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

రాజేంద్రనగర్: వరంగల్‌లో ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలను రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్ కోరారు. రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ.. వరంగల్‌లో భద్రకాళి మాత్ర దర్శనం అనంతరం అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారన్నారు. మోదీ బహిరంగ సభకు పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

గృహిణి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రిజ్వాన్ కాలనీకి చెందిన రఫీయా ఫాతిమా(25), మహ్మద్ షాకీర్‌లు భార్యాభర్తలు. గత కొంత కాలంగా ఫాతిమా ఆర్థిక ఇబ్బందుతో సతమతమవుతుంది. దీంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం గమనించిన భర్త పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్‌ఛానల్ ద్వారా ఊపిరితిత్తుల తరలింపు

శంషాబాద్: రాజమండ్రి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి శుక్రవారం సాయంత్రం చేరుకున్న ఊపిరితిత్తులను గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. ఇండిగో విమానంలో వచ్చిన ఊపిరితిత్తులను తరలించేందుకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షణలో గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో 29 నిమిషాల్లో కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



శంషాబాద్ రూరల్: పెద్దషాపూర్‌లో ఉన్న ప్రతాప్ నరేందర్‌రెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు పోతరాజుల వేషంలో ఊరేగింపులో పాల్గొన్నారు. కళాశాల ప్రతినిధులు రమేష్‌బాబు, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

సర్కారు భూమిని కాపాడాలి

శంషాబాద్ రూరల్: కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాకు గురవుతుందని పెద్దషాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెద్దషాపూర్ తండా శివారులో ఉన్న సర్వే నంబరు 220లో 105 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. 40 ఎకరాలను స్వాతంత్ర్య సమరయోధులకు అసైన్డ్ చేశారు. మిగిలిన భూమిని పేదలకు అసైన్డ్ చేశారు. పేదల నుంచి కొంత మంది ఈ భూములను కొనుగోలు చేయగా.. 2006లో అప్పటి రెవెన్యూ అధికారులు ఈ భూములను పీఓటీ కింద స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పది ఎకరాల భూమి మాదంటూ ఇటీవల కొందరు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పీఓటీ కింద స్వాధీనం చేసుకున్న విలువైన సర్కారు భూమి అక్రమంగా కాజేసేందుకు రియల్టర్లు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రియల్టర్లకు అధికారుల సహకారం ఉండడంతోనే ఈ తతంగం జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విలువైన సర్కారు భూమిని కాపాడాలని కోరారు. ప్రభుత్వ అవసరాలకు ఈ భూమిని వినియోగించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌నాయక్, మాజీ సర్పంచు ఇస్రానాయక్ పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ ఎల్లయ్య, తదితరులు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

బండ్లగూడ: ప్రజలకు సేవలందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర అన్నారు. నూతనంగా కమిషనర్‌గా నియమితులైన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



విద్యుత్ సమస్యలను నివారించాలి



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలను నివారించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 13వ వార్డులో హనుమాన్ ఆలయం వద్ద 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి, పగలు తేడా లేకుండా గంటల సమయం విద్యుత్ కోతలు ఏర్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజావసరాలకు తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్‌ల సంఖ్య, సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం అనేక కాలనీల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు శ్వేతారవికాంత్‌రెడ్డి, వందనగేష్, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మీరాములు, విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



శంషాబాద్ రూరల్: శంకరాపురం శివారులోని ఐఎంటీ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అరబిందో ఫార్మా కంపెనీ, ఐఎంటీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న పీజీ సర్టిఫికేషన్ ఇన్ లీడర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా విద్యను పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అరబిందో ఫార్మా లిమిటెడ్ అసోసియేట్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) రవినాథ్‌శెట్టి, ఐఎంటీ డీన్ డాక్టర్ వెంకట చతుర్వేద, డైరెక్టర్ డాక్టర్ శ్రీహర్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పట్టించుకోని మేయర్'

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉద్యానవనాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మికి మిగితా డివిజన్లపై నిర్లక్ష్యం చూపుతున్నారని అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ విమర్శించారు. శుక్రవారం అత్తాపూర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్య, చెత్త సేకరణ సమస్య, వీధిదీపాల సమస్యలు ఉన్నా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా మేయర్ మాత్రం కేవలం ఒక్క డివిజన్‌కు మాత్రమే పరిమితమైయ్యారన్నారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్ నగర్, శాస్త్రీపురం డివిజన్ తదితర ప్రాంతాలపై మెల్ల కంటి చూపు ప్రదర్శిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

ఫెలోషిప్ కార్యక్రమం ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎక్స్‌పీరియన్స్ టూ ఎవిడెన్స్ క్లీనికల్ రిసర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫైజర్ కంపెనీ సంయుక్తంగా ఈ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటసత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. రోగులపై చికిత్స ప్రభావాలను డెటా రికార్డింగ్, విశ్లేషణ, వారి ప్రవర్తన తదితర వాటిని ఈ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం కొందరిని ఫెలోషిప్ కోసం ఎంపిక చేశామని కార్పొరేట్ వైద్యశాలలో వీరు అధ్యాయనం చేస్తారన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫైజర్ కంపెనీ సంస్థతో మొట్ట మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉద్యోగులు

ఏజీవర్సిటీ: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని జూలై 16 నుంచి తెలంగాణలోని 33 జిల్లాల్లో రథయాత్ర చేపడుతున్నట్లు సీపీఎస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సీపీఎస్ విధాన్ని రద్దు చేయాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపతుతామని అన్నారు. జిల్లా అధ్యక్షుడు తాహేర్ అలి, విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, వెటర్నరీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సైఫోద్దీన్, విశ్వవిద్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభిస్తున్నట్లు డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రఘుయాదవ్ తెలిపారు. సర్కిల్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానికులు డ్రైనేజీ సమస్యతో పాటు గోతులమయమైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు తెలపడంతో ఆయన సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి నిధులను మంజూరు చేయించారన్నారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



శంషాబాద్: 14వ వార్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమాలన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్, పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, బండి శ్రీకాంత్ యాదవ్, కృష్ణకుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్

శంషాబాద్ రూరల్: లైంగిక వేధింపులు, సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శంషాబాద్ పోలీసులు శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మండలంలోని పాల్మాకులలో ఉన్న బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత వహించాలని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. భవిష్యతు బాగుండాలంటే విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. అపరిచిత వ్యక్తులకు మన బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ వివరాలు ఇవ్వకూడదన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



రాజేంద్రనగర్‌లో ..



కోకాపేటలో జెండాను ఆవిష్కరించిన గణేష్

మణికొండ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గండిపేట మండలం, కోకాపేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గణేష్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మాదిగల వర్గీకరణ తో ఉపకులాలకు ఉద్యోగ, విద్య,రాజకీయంగా అవకాశాలు వస్తాయన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరగనున్న మహాసభను విజయవంతం చేయాలన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేసి వేడుకలను జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకుడు వనం నర్సింహమాదిగ, క్యాసారం శంకర్‌రావుమాదిగ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు పోతురాజు మాదిగ, జిల్లా నాయకులు రామచంద్రమాదిగ, రాజేంద్రనగర్ సర్కిల్ దళిత సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీరాములు, కనకమామిడి జంగయ్య, కోరని శ్యామ్, నరేందర్ పాల్గొన్నారు.

'నా కుమార్తెను వెతికి అప్పగించండి'

శంషాబాద్: వారం రోజుల కిందట అదృశ్యమైన తన కుమార్తె విషయంలో అనేక అనుమానాలున్నాయని ఓ తల్లి తన ఆవేదనను వ్యక్తం చేసింది. కుమార్తెను వెతికి అప్పగించాలని వేడుకోంది. బాధితురాలైన తల్లి శుక్రవారం ఆర్‌జీఐఏ పీఎస్ వద్ద మీడియా ముందు తన గోడును వెళ్లబోసుకుంది. ఆమె మాట్లాడుతూ.. కుమార్తె అనురాధా (19) గతేడాది షోలాపూర్ నివాసి అయిన పాండురంగాకు ఇచ్చి పెళ్లి చేశా. జూన్ 28 ఇంటికి వచ్చిన నా కుమార్తె గతంలో తాను పనిచేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, మహిళా సంఘం అధ్యక్షురాలి ఇంటికి వెళ్లి పలకరించి వస్తానని చెప్పి వెళ్లింది. రాత్రికి ఇంటికి రమ్మని నేను, అనురాధ భర్త వెళ్లి అడిగినా నా కుమార్తె నిరాకరించి అక్కడే వారింట్లోనే ఉంది.. మరుసటి రోజు వెళ్లినా సమయంలో కూడా అదే విధంగా బదులిచ్చింది. ఆ సమయంలో సదరు ఇంటి యజమానులు కూడా నా కుమార్తెకు సహకరించి నన్ను అక్కడి నుంచి తిప్పిపంపారు. శుక్రవారం తెల్లవారు జామున నా కుమార్తెను రమాదేవి ఇంట్లో పనిచేస్తున్న ఓ మహిళ భర్త సీబీఎస్ బస్టాండ్‌లో బస్సు ఎక్కించినట్లు చెబుతు న్నారు. ఎవరు పట్టించుకోకపోవడంతో నాలుగు రోజుల కిందట ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించానంది.